# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 21, అక్టోబరు, 2014

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య ఖర్చులను నూటికి నూరు శాతం ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. ఉద్యోగుల వైద్య ఖర్చులకు సంబంధించి పరిమితిని కూడా పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. దీపావళి పండగ సందర్భంగా ఉద్యోగులకు హెల్త్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఉద్యోగుల హెల్త్‌కార్డుల జారీకి సంబంధించి సచివాలయంలో మంగళవారం సమీక్ష జరిగింది. ఉప ముఖ్యమంత్రి డా.టి.రాజయ్య, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రాజీవ్ శర్మ, ఉద్యోగ సంఘాల నాయకులు దేవిప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, విఠల్, మమత, ప్రభుత్వ కార్యదర్శులు నర్సింగ్‌రావు, సురేష్, నాగిరెడ్డి, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్న సమీక్షలో ముఖ్యమంత్రి పలు నిర్ణయాలు ప్రకటించారు. గతంలో ఉద్యోగి మొత్తం కుటుంబానికి రూ. 2 లక్షల పరిమితితో ఆరోగ్య పథకం అమలు చేసేవారు. ఇప్పుడు ఈ నిబంధనను తొలగిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్ల కుటుంబ సభ్యులకు ఆరోగ్యం కోసం ఎంత ఖర్చయినా ఆ ఖర్చునంతా ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గతంలో ఆరోగ్య పథకం కోసం ఉద్యోగులు వాటా ధనం చెల్లించేవారు. ఇప్పుడు ఆ నిబంధనను కూడా తొలగించారు. ఉద్యోగులు ఈ పథకం కోసం తమ జీతాల్లోంచి ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, నూటికి నూరు శాతం ప్రభుత్వమే ఆ ఖర్చును భరిస్తుందని కేసిఆర్ వెల్లడించారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం దేశంలోని ఏ ప్రభుత్వం తీసుకోనంత ఉదారంగా నిర్ణయాలు తీసుకుంటున్నదని ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు ముఖ్యమంత్రిని అభినందించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల అత్యంత సానుకూలంగా ఉంటుందని, తెలంగాణలో ఎంప్లాయి ఫ్రెండ్లీ వాతావరణ ఉంటుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఉద్యోగులు కూడా మరింత అంకిత భావంతో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా వివిధ పన్నుల విభాగానికి చెందిన ఉద్యోగులు మరింత ప్రణాళికబద్ధంగా వ్యవహరించి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణలో జోనల్ వ్యవస్థ ఉండాలా? వద్దా? ఉంటే ఎలా ఉండాలి? క్యాడర్ విధానం ఎలా ఉండాలి? సర్వీస్ నిబంధనలు ఎలా ఉండాలి? అనే విషయాలపై వివిధ ఉద్యోగ సంఘాలు తమ ప్రతిపాదనలను ఉద్యోగ సంఘాల జెఏసి అధ్యక్షుడు దేవిప్రసాద్‌కు అందివ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు. వీటిపై కూడా త్వరలోనే ఓ సమావేశం పెట్టి నిర్ణయం తీసుకుంటామన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం